నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 11 మార్చి 2024 | www.navatelangana.com

కొమురెల్లి జాతరకు పోటెత్తిన భక్తజనం

8వ వారానికి భారీగా వచ్చిన భక్తులు

నవతెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి మల్లన్న జాతరకు భక్తులు పోటెత్తారు. మల్లన్న నామస్మరణతో ఆలయం మార్మోగింది. శివసత్తుల పూనకాలు పోతురాజుల చిందులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి స్వామివారికి ఓడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్నాలు వేసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ప్రత్యేక అలంకరణలతో బోనాలు చేసి మల్లన్నకు గుట్టపై ఉన్న ఎల్లమ్మకు బోనాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు పాలక మండలి సభ్యులు సేవలందించారు. ఆలయ ఈఓబాలాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-కొండపాక



మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని కొండపాక మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో నాబార్డ్ వారి సహకారంతో మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై 20 రోజుల శిక్షణా శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం ఫ్యాబ్రిక్ మగ్గం వర్క్‌లకు డిమాండ్ ఉందని వాటిని నేర్చుకొని స్వయం ఉపాధి పొందా లన్నారు. సెర్ప్ ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం నాబార్డు పలు కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్,సీసీ యాకుబ్, వివో లీడర్లు బాలలక్ష్మి, ఐఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం, వివోలు కవిత, రేణుక మహిళలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మెదక్



జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు రెంజుకి షాటోకాన్ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. మనోహరాబాద్ శ్రీ శుభం ఫంక్షన్ హాల్లో సన్‌షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ రెండో జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్స్‌ను నిర్వహించినట్లు నిర్వహించగా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవాతో పాటు సుమారు 10 రాష్ట్రాల నుంచి 1500 మంది విద్యార్థులు పోటల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో రెంజుకి షోటోకాన్ మెదక్ విద్యార్థులు.. గర్ల్స్ టీం కటాస్ విభాగంలో మనస్విని, రక్షిత, హనా ఎవలెన్ (బంగారం), అండర్ 8 విభాగంలో జయశ్రీ (బంగారం), అండర్ 9 విభాగంలో నీశ్విత (బంగారం), అండర్ 12గర్ల్స్ విభాగంలో మిన్ను (బంగారం), కరిష్మ (సిల్వర్), అండర్ 13 విభాగంలో బినీత (గోల్డ్), నిఖిత(సిల్వర్), బాలుర అండర్ 8 కాటస్ విభాగంలో విహాన్ (బంగారం), అండర్ 9 కాటస్ విభాగంలో సుదీష్, సుధాన్స్, అండర్ 13 బాయ్స్ కాటస్ విభాగంలో శ్రీరామ్ (బంగారం), బ్రౌన్ బెల్ట్ అండర్ 11విభాగంలో కనిష్క చారి (బంగారం), అండర్ 12 విభాగంలో షన్ ప్రజీత్(గోల్డ్), అండర్ 13విభాగంలో శ్రీరాజ్ (బంగారం) మొత్తం 14 బంగారు పతకాలు, 2 వెండి పథకాలు సాధించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని అక్కున చేర్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-పటాన్‌చెరు



నాడు తమ హక్కుల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పడితే కేసీఆర్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపిందని.. కానీ నేడు ఆర్టీసీని అక్కున చేర్చుకొని పీ3ఆర్సీ ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అని కాంగ్రె స్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికులకు పిఆర్సి ఇచ్చిన సందర్భంగా పట్టణంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ కార్మికులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కొరకు సమ్మె బాట పడితే సమ్మెను పూర్తిగా అణిచివేసి సుమారు రెండు నెలలుగా రోడ్లపైనే కూర్చోబెట్టిన ఘనత అప్పటి కేసిఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. అంతే కాకుండా ఆ సమ్మెలో భాగంగా కుటుంబ పోషణ భారమై పలు సమస్యలతో సుమారు 55 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న నాటి ప్రభుత్వం చలించలేదన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పైన కార్మికులకు అండగా ఉండాలని అప్పటి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి పిలుపుమేరకు ప్రగతి భవను ముట్టడికి వెళ్లగా.. తమను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఈ మూడు నెలల లోపే ఐదు లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ, భారమని తెలిసి నా ఆర్టీసీ కార్మికులను అక్కున చేర్చుకున్నదన్నారు. పీఆర్సీ పెంపుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా పైన బారం పడుతు న్నప్పటికీ 53 వేల మంది కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పీఆర్సీ పెంచడం గొప్ప విషయ మన్నారు. ఈ సందర్భంగా ఐఎన్టీ యూసీ తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి,అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, డిప్యూటీ సూపర్ డెంట్ ఇసాక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హమీద్, యువ రాజ్ మోరే,అతిక్, కార్మిక నాయకులు సంజీవ్, రతన్‌సింగ్, శ్రీనివాస్ రాజు,ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

స్థానికత పేరుతో ఒరగబెట్టిందేమీ లేదు

నవతెలంగాణ-వట్‌పల్లి



గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో స్థానికత పేరుతో అధికారం చేపట్టినా.. మండలానికి ఒరగబెట్టిందేమీ లేదని జెడ్పీటీసీ పత్రి అపర్ణ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రమేష్ జోషి అన్నారు. స్థానికత అంటూ నాడు పబ్బం గడిపారు తప్పా.. అభివృద్ధి మాత్రం చేయలేదన్నారు. శనివారం రోజున మంత్రి దామోదర రాజనర్సింహా మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయడంతో.. మంత్రి చిత్రపటానికి ఆదివారం వారు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు-మనబడి పనుల్లో భాగంగా ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనుల్లో అవినీతి ఏరులై పారిందని ఆరోపించారు. పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించిందని.. కొన్ని గ్రామాల్లో పనులు పూర్తికాకుండానే పగుళ్లు వస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యేకు రాజకీయ ఏజెంట్‌గా పనిచేసిన మండలానికి చెందిన ఓ వ్యక్తి.. విపరీతంగా కమీషన్లు దండుకున్నాడని ఆరోపించారు. మూడేండ్లుగా జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా.. దేవునూరు గ్రామంలోని రైతు వేదిక భవనంలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని.. అక్కడ తరుగు పేరుట క్వింటాకు మూడు కిలోల నుంచి ఐదు కిలోల వరకు దండుకుని రైతులను నిలువునా ముంచారని దుయ్యబట్టారు. ఇలాంటి అవినీతి పనులపై తప్పకుండా విచారణ చేయిస్తామన్నారు. అభివృద్ధిలో మంత్రి దామోదర రాజనర్సింహకు సాటి ఎవరూ లేరన్నారు. కాగా జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పత్రి విట్టల్, పాపయ్య, మేడికొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రిటైర్మెంట్ టీచర్, కచూర్ రావు, శ్రీశైలం, ప్రశాంత్, శ్రీనివాసరెడ్డి, అమృతరావు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని ముగ్దుమ్ పల్లిలో సీసీరోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ ఆదివారం ప్రారంభిచారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో ఎస్సీ కాలనీలో రూ.5లక్షలతో అంతర్గత రహదారులు నిర్మించి గ్రామస్థుల ఇబ్బందులు తొలగించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.నాగిశెట్టి, ఈశ్వరప్ప, చాంద్ పాష పటేల్, సి హెచ్.వీరన్న, బి.శ్రీశైలం, సునీల్, ప్రభు, బి.అనిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలాగే మండలంలోని అల్లపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద మంజూరైన రూ.5లక్షల సీసీరోడ్ల పనులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం ఆల్లపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలూకరి శంకరయ్య టీచర్ పంచాయితీ కార్యదర్శి లక్ష్మి గ్రామకమిటి అధ్యక్షులు సిద్దులు, యూత్ అధ్యక్షులు కొల్కురి విజయ్, మైనారిటీ అధ్యక్షులు మైబల్లి, గ్రామ పెద్దలు సంగయ్య, శ్రీశైలం, వెంకటేశం, మొగులయ్య హరిజన్ కాశయ్య, మొగులయ్య, ఆగమయ్య, మాణయ్య,మోహిన్ తదితరులు పాల్గొని ప్రారంభించారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-వర్గల్

మనస్తాపంతో క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సామలపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సామలపల్లి గ్రామానికి చెందిన నవనితకు (20) రెండున్నర ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వివాహం తరువాత తరచూ తల్లిగారి ఇంటికి వస్తుండేది. తరచూ పుట్టింటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. దాంతో మనస్తాపం చెందిన ఆమె.. ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రేబర్తిలో పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు మద్దూరు ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలోని రేబర్తి గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు నమ్మదగిన సమాచారం రావడంతో.. దాడి జరపగా ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని.. వారి వద్ద నుంచి రూ.5880 నగదు, 7 మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ తెలిపారు.

వినోదానికి దూరంగా జోగిపేట

- నాడు కిటకిట... నేడు వెల వెల
- సినిమా థియేటర్ లేక జనం బేజారు
- వ్యాపారాలపై ప్రభావం
- మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వ్యాపారులు



మూతబడిన వెంకటేశ్వర టాకీస్..

నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణం ఒకప్పుడు వినోదానికి కేంద్ర బిందువుగా ఉండేది. అందోల్ మండలంతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల నుంచి ప్రజలు జోగిపేటకు వచ్చి సినిమా థియోటర్ల ద్వారా వినోదాన్ని ఆస్వాదించేవారు. జోగిపేట పట్టణంలో శ్రీ వెంకటేశ్వర, రెండు హనుమాన్ టాకీస్ అనే థియేటర్లు ఉండేవి. 30 సంవత్సరాలకు పైగా నడిచాయి. కొత్త సినిమాలు సైతం రిలీజ్ అయ్యేవి. దిల్ రాజు లాంటి స్టార్ ప్రొడ్యూసర్ వెంకటేశ్వర థియేటర్ ను కొంత కాలం లీజుకు తీసుకొని నడిపించారు. థియేటర్ కు సినిమా చూడడానికి వచ్చిన వారు స్థానికంగా ఎదో ఒకటి కొనుగోలు చేసేవారు. దీంతో వ్యాపారాలు కూడా బాగా నడిచేవి. దీంతో జోగిపేట పట్టణంలోని వ్యాపారులు కూడా ఆనందాన్ని వ్యక్తం చేసేవారు. కొత్త సినిమా వచ్చిందంటే చాలు టాకీస్ లు కిటకిటలాడేవి. టాకీస్‌లు కరోనా సమయం నుంచి మూత పడడంతో వ్యాపారులపై పెద్ద ప్రభావం పడింది. కాలక్షేపం, కొంత రిలీఫ్‌గా ఉంటుందని సినిమా ప్రియులు కాసేపు ఆనందం పొందటకు జోగిపేటకు వచ్చి సినిమాలు చూసేవారు. రాను రాను సినిమా టాకీస్ లు కాలగర్భంలో కలిసిపోయాయి. ఉన్న రెండు సినిమా టాకీస్‌లను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దాంతో ఒకదాని వెనుక ఒకటి మూతపడ్డాయి. ఒక్కోడ ఒకనాడు ఒక వెలుగు వెలిగిన సినిమా టాకీస్ లు నేడు వెవెల బోతున్నాయి. హనుమాన్ టాకీస్‌ను స్థానికంగా ఉన్న బంగారం వ్యాపారి కొనుగోలు చేసుకుని అక్కడ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నాడు. మరొక శ్రీ వెంకటేశ్వర సినిమా టాకీస్ అలాగే వదిలేసారు. థియేటర్ భాగస్వాముల మధ్య సమన్వయ లోపం కారణంగానే మూత పడినట్లుగా తెలుస్తుంది.

వలస బాట పట్టిన కార్మికులు..

రెండు సినిమా టాకీస్‌లలో పనిచేసిన కార్మికులకు వేరే ఉపాధి మార్గాలు దొరకక వలసబాట పడుతున్నారు. ఇటీవల దాసు అనే కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందారు. టాకీసులు మూతపడడంతో ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారు. 10, 20 ఏళ్ల నుంచి థియేటర్‌లలోనే పనిచేసే అనుభవం ఉండడంతో ఇతర పనులు చేసుకునేందుకు ఆరోగ్యాలు సహకరించక ఎదో దారిచూసుకుంటున్నారు. సంగారెడ్డి, సదాశివపేట, మెదక్, హైదరాబాద్‌లకు వెళ్లి సినిమా టాకీస్‌లలో అర్హత కలిగిన వారు పనులు చేసు కుం టున్నారు. చాలా ఏండ్లుగా ఇక్కడ ఒక టాకీస్‌లో మేనేజర్ గా పని చేసిన ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఆయన తిరిగి వెళ్లలేక ఇక్కడే సెటిల్ కావాల్సి వచ్చింది. కొంతమంది జోగి పేటలో ఇతరపనులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

ప్రజల బేజారు..

రెండు సినిమా టాకీసులు ప్రస్తుతం లేకపోవడంతో ప్రజలు ఆనందానికి దూరమయ్యారని చెప్పవచ్చు. సినిమా ప్రియులు సంగారెడ్డి, సదాశివపేట, బీహెచ్‌ఈఎల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి సినిమాలు చూసి వస్తున్నారు. సినిమాలు చూడాలంటే సుదూరం వెళ్లి చూడాల్సి వస్తుందని ప్రజలు వాపోతు న్నారు. పల్లెటూరు జనం మాత్రం తాము అందుబాటులో ఉన్న సినిమా టాకీస్‌లో లేకపోవడంతో కాసేపు ఆనందపడే అవకాశం లేకుండా పోయిందని పలువురు అంటున్నారు.

వ్యాపారాలు డీలా..

సినిమా టాకీస్‌ల ప్రభావం జోగిపేట పట్టణంలో పలు వ్యాపారాలపై పడింది. సినిమాను చూసేందుకు వచ్చే జనాలు రోజురోజుకు తగ్గిపోవడంతో వ్యాపారాలు కూడా తగ్గు ముఖం పట్టాయని పలువురు అంటున్నారు. ముఖ్యంగా ఇక్కడ బట్టల షాపులు, బంగారం షాపులు, కిరాణా షాపులు, ఇతర వ్యాపారాలు అత్యధికంగా కొనసాగుతాయి. సినిమాల ప్రభావంతో 50శాతం వ్యాపారాలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు జోగిపేటకు సినిమాల కోసం వచ్చిన వారు రాత్రి 12 గంటల వరకు కూడా జోగిపేటలో ఉండేవారు. వారికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుని వెళ్లేవారు.

బైపాస్ రహదారితో మరింత దయనీయం..

ఇటీవల నిర్మించిన బైపాస్ రోడ్డు వలన కూడా జోగిపేటలో వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయని చెప్పొచ్చు. జోగిపేటకు మూడు కిలోమీటర్ల దూరం నుంచి సంగుపేట నుంచి నేరడి గుంట మీదుగా బైపాస్ రోడ్డు వెళ్లడంతో జోగిపేట లోపలికి వచ్చే జనాలు రావడం లేదని తెలుస్తోంది. లారీలు, జీబులు, క్రూజర్లు, ఇతర పెద్ద పద్ద వాహనాలు బైపాస్ మీదుగా వెళ్లడంతో జోగిపేటలో హొటళ్లు, ఇతర వ్యాపారస్తులకు గిరాకీ తగ్గిందని చెప్పవచ్చు. కొన్ని హొటళ్లు మూతపడ్డాయి.

మంత్రి దృష్టికి సినిమా టాకీస్‌ల వ్యవహారం..

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి సినిమా టాకీస్ ల వ్యవహారాన్ని స్థానిక వ్యాపారులు తీసుకెళ్లారు. సినిమా టాకీసులు జోగిపేటలో లేకపోవడంతో వ్యాపారాలు తగ్గుముఖం పడ్డాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎలాగైనా జోగిపటలో సినిమా టాకీస్ నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యాపారస్తులు మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. సినిమా టాకీస్‌లో వస్తే వ్యాపారాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, జనాలు కూడా జోగిపేటకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో ఏం చేస్తే బాగుంటుంది అనే విషయాలను ఇటీవల మంత్రి వ్యాపారులతో చర్చించారు. అజమరి నుంచి జోగిపేటకు రూ.80 కోట్లతో వంతెన బ్రిడ్జ్ కు ఇటీవలే ఆయన శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు వేస్తే కూడా నర్సాపూర్ తదితర ప్రాంతాల నుంచి తక్కువ దూరంలో జోగిపేటకు ప్రజలు తిరిగే అవకాశాలు ఉన్నాయని, ఇది వ్యాపారస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఈ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తుంది. వంతెన బ్రిడ్జితో వ్యాపారస్తులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. సినిమా టాకీస్ లు ఇక్కడ తీసుకురావడానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. జోగిపేట పట్టణంలో వ్యాపారాలు పెంచేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది. గత పూర్వ వైభవాన్ని జోగిపేటకు తీసుకువచ్చేందుకు అనేక ప్రణాళికలు ఆయన రచిస్తున్నట్లు సమాచారం.

హొటల్ గిరాకీ చాలా తగ్గింది



సినిమా టాకీసులు లేక, బైపాస్ రోడ్డు వలన హొటల్ గిరాకీ చాలా తగ్గింది. ఉదయం పూట టిఫిన్‌ల కోసం చాలామంది వచ్చేవారు.. ప్రస్తుతం బైపాస్ రోడ్డు వలన రవాణా చేసే వాహనాలు అక్కడ నుంచి వెళ్లడంతో గిరాకీ చాలా తగ్గింది.

- విజయ్ శెట్టి, సుప్రభాత్ హొటల్ జోగిపేట

వ్యాపారం చాలా తగ్గింది



గతంలో పెళ్లిళ్లు ఇతర శుభ కార్యక్రమాలకు జోగిపేట తో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వచ్చి, బట్టలు, బంగారం, కిరాణం వస్తువులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం సినిమా టాకీస్‌ల మూసివేత ప్రభావం, బైపాస్ రోడ్డు నిర్మాణంతో చాలా మటుకు హైదరాబాదుకు వెళ్లి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేస్తే తమకు కొంత ఆర్థికంగా మిగిలి ఉండేది. ప్రస్తుతం వ్యాపారాలు మందగించాయి.

- బసవ సత్య ప్రకాష్, వ్యాపారి

టాకీస్‌లో సూపర్వైజర్ గా పనిచేసేవాన్ని..



గతంలో జోగిపేటలో సినిమా టాకీస్‌లు జోగిపేటలో ఉన్నప్పుడు సినిమా ఆపరేటింగ్ నేర్చుకొని ఓ టాకీస్‌లో పనిచేసేవాణ్ణి. ఇంటి పట్టు నే ఉండి టాకీస్ లో పనిచేయడంతో తనకు ఆర్థిక భారం చాలా తగ్గేది. ఇంటి దగ్గరే భోజనం చేసి అందరితో ఉంటూ పని చేసుకునే వాడిని. ఇక్కడ నుంచి టాకీస్ తీసివేయడంతో సంగారెడ్డి, సదాశివపేట, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి సినిమా టాకీస్‌లలో పనిచేశాను. తనకు ఆర్థిక భారం దీంతో చాలా పెరిగింది. ఉదయం వెళ్లి రాత్రి సమయాల్లో వచ్చేవాడిని. కుటుంబానికి కూడా చాలా దూరమయ్యాను.

-శివచందర్, జోగిపేట

సామాన్యుల ఏకైక వినోద సాధనం సినిమా



సినిమా థియేటర్ అనేది విశ్రాంతి తీసుకోవడానికి, మనస్సును ఆందోళనల నుంచి దూరం చేయడానికి, మానసిక ప్రశాంతత నిచ్చేలా మరియు మానసిక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవడానికి సామాన్య ప్రజలకు అత్యంత ముఖ్యమైన వినోద సాధనం సినిమా. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిన శ్రమ ను మరచిపోవడానికి, ఆటవిడుపుగా, సరదాగా గడపడానికి ఎంచుకొనే ప్రదేశం సినిమా ఒక్కటే. అందోల్ నియోజకవర్గం జోగిపేటలో కరోనా తరువాత సినిమాకు ప్రేక్షకులు రావడం తగ్గిన తరువాత జోగిపేటలో ఉన్న ఒకే ఒక్క సినిమా థియేటర్ మూతబడడం సినీ ప్రేక్షకులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. ప్రస్తుతం జోగిపేటలో సినిమా థియేటర్ తిరిగి పునఃప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఆకుల మానయ్య, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు, జోగిపేట

గ్రామీణ ప్రాంతాల నుంచే ఆదర్శవంతమైన క్రీడలు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్





గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడలే.. ఆదర్శ వంతమైన క్రీడలుగా నేడు ముందుకు వెళ్తున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని పొతరం ఎస్ గ్రామంలో చేపట్టిన జిల్లా స్థాయి కబడ్డీ క్రీడ జట్టు పోటీల కార్యక్రమంలో పాల్గొన్నారు. కబడ్డీ క్రీడాకారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోతారం గ్రామంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శారీరకంగా, మానసికంగా క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ఆదర్శవంతమైన క్రీడలు నిర్వహించడం వల్ల ఊర్లో చైతన్యం పెరుగుతుందన్నారు. ఈ కబడ్డీ పోటీలు విజయవంతం కావాలని అంతా కలిసికట్టుగా ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, మండల అధ్యక్షుడు బంక చందు, స్థానిక ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి..

హుస్నాబాద్ పట్టణంలోని సివి రామన్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పరీక్షలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వారు మెయింటెన్ చేస్తే.. ఒక అంబులెన్స్ కొనిస్తానన్నారు. లయన్స్ క్లబ్ అయితే పారదర్శకంగా నిర్లక్ష్యం లేకుండా నడుస్తుందన్నారు. మీరు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తామంటే స్థానిక శాసనసభ్యుడిగా అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తే.. ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

- మావోయిస్టుల పేర బ్యానర్, గోడలపై రాతలు
- హెటిరో ఫార్మా యాజమాన్యం పేదల నుంచి సేకరించిన భూములను తిరిగి ఇచ్చేయాలని హెచ్చరిక

నవతెలంగాణ-తొగుట



పేద ప్రజల భూములను అక్రమంగా కొనుగోలు చేసి కంపెనీలు కట్టి పెట్టుబడిదారులకు కొమ్ముగాస్తే.. ఎంతటి వారికైనా ప్రజాకోర్టులో శిక్షతప్పదని మావోయిస్టుల పేర వెలిసిన బ్యానర్, గోడలపై రాతలు ఆదివారం కలకలం సృష్టించాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని పెద్దమాసంపల్లి మధిర గ్రామమైన ఇందిరానగర్, కొండపాక మండల సిరిసినగండ్ల గ్రామాల్లో పదేండ్ల క్రితం హెటిరో ఫార్మా కంపెనీ యామాన్యం సుమారు 400 ఎకరాలను రైతుల వద్ద నుండి సేకరించారు. అయితే నాడు ఫార్మా కంపెనీ కోసం కొనుగోలు చేస్తున్నామని గ్రామస్తులకు తెలియకుండా.. మధ్యవర్తుల ద్వారా రైతుల వద్ద నుంచి భూములను కొనుగోలు చేశారు. కాగా ఆ భూముల్లో ఫార్మా కంపెనీ నిర్మాణం జరుగుతుందని గ్రామస్తులకు తెలియడంతో.. కంపెనీ కొనుగోలు చేసిన భూముల్లో టెంట్లు వేసి పెద్ద యెత్తున ఉద్యమం కూడా చేశారు. దాంతో ఆ స్థలంలో ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సీపీఐ మావోయిస్టుల పేరిట కంపెనీ భూముల వద్ద ఉన్న గోడలపై ప్రత్యక్షమైన రాతలు, బ్యానర్ సంచలం రేపుతున్నాయి. 'అక్రమంగా నిరుపేదల వద్ద భూములను కొనుగోలు చేసి కంపెనీలు కట్టి పెట్టుబడిదారులకు కొమ్ముకాయలని చూస్తే ప్రజా కోర్టులో శిక్ష తప్పదంటూ' ఆ బ్యానర్‌లో ఉండడం గమనార్హం. అంతేకాకుండా పేదల భూములను తిరిగి ఇచ్చేయాలని కూడా అందులో డిమాండ్ చేశారు. దాంతో హెటిరో కంపెనీ భూయజమానుల్లో ఒక్కసారిగా కలవరం మొదలైంది.





చిన్నఘనపూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసిన మూడు ఇండ్లల్లో చోరీ
- నెల వ్యవధిలో రెండో ఘటన

నవతెలంగాణ-కొల్చారం



మండలంలోని చిన్నఘనపూర్ గ్రామంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న మూడు ఇండ్లలో చోరీకి పాల్పడి నగదుతోపాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన బట్టి గారి బుదమ్మ, వడ్డే ఎల్లయ్య, కమ్మరి విమల అనే మూడు కుటుంబాలు శనివారం ఇంటికి తాళం వేసి ఏడుపాయల జాతరకు వెళ్లారు. అదే అదునుగా భావించిన దుండగులు.. మూడు ఇండ్లల్లో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బుదమ్మ ఇంట్లో రూ.30 వేల నగదు, ఒక తులం బంగారు కమ్మలు, 20 తులాల పట్ట గొలుసులు.. వడ్డే ఎల్లయ్య ఇంట్లో అరతులం బంగారం, కిలోవెండి వస్తువులు, రూ.10వేల నగదు, ఒక ఎల్ఈడి టీవీ చోరీకి గురైంది. కమ్మరి విమల ఇంట్లో రూ.5వేల నగదు, కిలో కారంపొడిని దుండగులు ఎత్తుకెళ్లారు. గత నెల రోజుల క్రితం కూడా ఇదే గ్రామంలో వెంకటాపురం బాలయ్య వడ్ల, లక్ష్మీనారాయణ ఇండ్లలో చోరీ జరగ్గా.. ఈ సంఘటనలో సుమారు ఐదు తులాల బంగారం, లక్ష నగదు చోరీకి గురైంది.నెల వ్యవధిలో రెండోసారి చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం చోరీ జరిగిన ఇండ్లలో క్లూస్ టీం సిబ్బంది పరిశీలించి.. పూర్తి ఆధారాలు సేకరించారు. త్వరలో నింతులను పట్టుకుని శిక్షించనున్నట్లు ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి







నవతెలంగాణ-సంగారెడ్డి

సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్టీ కళాశాల హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు, అడ్వకేట్ లక్ష్మి హాజరై మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని అన్నారు. సావిత్రిబాయి భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు.., పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి అని అన్నారు. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నతపు నేత అని అన్నారు. అందరూ చదవాలి... అందరూ సమానంగా బతకాలి అని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృ మూర్తి సావిత్రిబాయి అని అన్నారు. విద్యార్థినులు సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్,గర్ల్స్ కన్వీనర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్ : మండలంలోని కృష్ణాపూర్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పులే చిత్రపటానికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీల విద్య కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అన్నారు. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకురాలు అని కొనియాడారు. మహిళలు సావిత్రి పూలేను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ మండల నాయకుడు బైండ్ల అశోక్, సాయిలు, ప్రకాష్, రాములు, మహిళలు మరియమ్మ, సౌందర్య, ఇందిర, సమాధాన, సంధ్య, పవిత్ర పాల్గొన్నారు.

బెజ్జంకి : మహిళల అభ్యున్నతితో పాటు సమాజంలో తలెత్తిన అసమానతలను రూపు మాపడానికి సావిత్రి బాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని బీఎస్పీ,స్వేరోస్ నాయకులు కొనియాడారు.ఆదివారం మండల కేంద్రంలోని పూలే దంపతుల విగ్రహాల చౌరస్తా వద్ద బీఎస్పీ,స్వేరోస్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.స్వేరోస్ నెట్ వర్క్ జిల్లాధ్యక్షుడు ఉప్పులేటి బాబు, బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దొల్ల శ్రీనివాస్ యాదవ్, బుర్ర సంతోశ్,కవ్వంపల్లి జీవన్, జాన్, ఓరుగంటి రత్నం,వెంకటేశ్,పవన్,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ మండలంలోని గోసాంఖపల్లిలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం జరిగిన జాతరలో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శివయ్య ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి పార్టీ మండల అధ్యక్షులు సంజీవరావు పాటిల్, రామ్ సింగ్, సర్పంచ్ సాయ గౌడ్, గ్రామ పెద్దలు ధనరాజ్ గిరి, వివేక్ గిరి, నారాయణ గౌడ్, నాయకులు రాములు, సాయ గౌడ్, చాకలి శ్రీను, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్ లో ఆదివారం కాలనీ డ్వాక్రా గ్రూప్ మహిళల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా హాజరై కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విజేతలకు కాట సుధా బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జర్నలిస్టులకు బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్‌లో సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మీడియా మిత్రులకు ఆదివారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సురేందర్, నవాజుల్, సతీష్, దత్త్రాత్రి, రాములు, విష్ణు గౌడ్, వేణు గోపాల్, డాక్టర్ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవు



నవతెలంగాణ-పుల్కల్

మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని పుల్కల్ ఎస్ఐ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ..చాలామంది మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువకులే ప్రాణాలను పోగొట్టుకుంటున్నారన్నారు. రెండ్రోజుల క్రితం చౌటాకుర్ మండలం శివంపేట బీరు పరిశ్రమ వద్ద ప్రమాదం జరిగిన ప్రమాదంలో నలుగురు యువకులు అక్కడికక్కడే మృతిచెందారన్నారు. కాబట్టి వాహనాలు నడిపేవారు పలు జాగ్రత్తలు తప్పకుండా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు అన్నారు. తాగి వాహనాలు నడిపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



విగ్రహ ప్రతిష్టాపన ఆహ్వాన కార్యక్రమానికి ఆహ్వానం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

అమీన్‌పూర్ మండలం, వడక్‌పల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఈనెల 13న నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాపన కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్యగౌడ్,రవిందర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో గల బీసీ కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ సంగీత గుండప్ప ఆదివారం ప్రారంభించారు. గ్రామాన్ని దశలవారీగా అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నందకుమార్, సాబీర్, బాబు మియా, బస్వరాజ్, శంకర్, రామయ్య వెంకన్న, సంఘన్న రామచందర్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఖేడ్ పట్టణంలోని విజేత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా, డీఈఓగా, ఎంఈఓగా, ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించి.. ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అనంతరం డాన్సులు, పాటలతో ఉత్సాహంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు రాజు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి మంచి స్థాయికి ఎదగాలన్నారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లులాంటి మంచి హెూదాను సంపాదించుకోవాలన్నారు. విద్యార్థులు ఉండాలని అన్నారు. పట్టుదలతో చదివి వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్‌ను విమర్శించడం సరికాదు



నవతెలంగాణ-పుల్కల్

దత్తత తీసుకున్న గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసినప్పటికీ జెడ్పీచైర్‌పర్సన్ మంజు శ్రీ జైపాల్‌రెడ్డిని విమర్శించడం సరికాదని పోచారం మాజీ సర్పంచ్ స్వాతి కనకారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జెడ్పీనిధులతో గ్రామంలోని పలు విధుల్లో మురికి కాలువలు, సీసీరోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి సౌకర్యాలు, అంతేకాకుండా బోర్లు కూడా వేశారన్నారు. అన్ని అభివృద్ధి పనులు చేసినప్పటికీ.. జడ్పీ చైర్పర్సన్‌ను విమర్శించడం సరికాదన్నారు. గత 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి పనులను.. కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జెడ్పిచైర్‌పర్సన్ పట్ల అవహేళనగా మాట్లాడడం సరికాదు అని మండిపడ్డారు. గ్రామంలో గ్రామసభ పెట్టి ఎవరి హయాంలో గ్రామాభివృద్ధి జరిగిందనే దానిపై చర్చ పెడితే.. దానికి గ్రామస్తులే సమాధానం చెబుతారన్నారు.

అంగరంగ వైభవంగా

పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

- హాజరైన ఎమ్మెల్యే మాణిక్‌రావు
- పట్టు వస్త్రాల సమర్పణ
- తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు





నవతెలంగాణ-ఝరాసంగం

మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో పార్వతీ సమేత సంగమేశ్వర కళ్యాణం ఆదివారం ఆలయ ఆవరణనలో అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు స్వామి వారికి భాజా భజంత్రీల మధ్య పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి కేతకీ వాసుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో చూడముచ్చటగా అలంక రించిన పచ్చని తోరణాల మధ్య పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కన్నుల పండుగ్గా జరిగింది. ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తు వాయిద్యాలు అశేష భక్త జనాలు తిలకిస్తుండగా అమ్మవారి మంగళ సూత్రధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజతో పాటు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషే కాలు, అర్చనలతో కేతకి ఆలయం భక్తులతో ఓం నమశ్శి వాయ నామ స్మరణతో మార్మోగింది. కోరికలు తీరుస్తూ భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వరుని చూసేందుకు భక్తులు బారులు తీరా రు. ఈ కళ్యాణ మహెూత్సవానికి అశేష భక్తజనంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణా టక, మహారాష్ట్రకు చెందిన భక్తులతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో మహిళా మణు లు కళ్యాణ మహెూత్సవం తిలకిం చేందుకు హాజరయ్యారు. అనంతరం భక్తులు కల్యాణ ప్రాప్తిరస్తు అంటూ పార్వతి సంఘం మిత్రులకు తీసుకు వచ్చిన ముత్యాలను వేసి ఈ కల్యాణం వైభవంగా కనులారా చూసి ఆనందించారు. కల్యాణ మహెూత్సవానికి హాజరైన వారందరికీ పార్వతి సంగమేశ్వర ఆశీస్సులతో పాటు పసుపు, కుంకుమ తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సునీత-హనుమంతరావు పాటిల్, మాజీ సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్, మాజీ ఆలయ చైర్మెన్ వెంకటేశం గుప్తా, ఆలయ ఈవో శశిధర్, ఎంపీటీసీ రజినీ ప్రియ సంతోష్ పాటిల్, మాజీ సర్పంచులు జగదీశ్వర్, రుద్రప్పపాటిల్, మహిళదంపతులు తదితరులు పాల్గొన్నారు.



మతసామరస్యానికి ప్రతీకలు జాతరలు



నవతెలంగాణ-జహీరాబాద్

జాతరలు మతసామరస్యానికి ప్రతీకలు అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. కోహిర్ మండలంలోని మచిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన జిందే మధార్ షావాలి జాతర ఉత్సవాల్లో స్థానిక జహీరాబాద్ శాసనసభ సభ్యులు కొన్నింటి మణిక్ రావు, టీఎస్ఐడిసి చైర్మన్ మొహమ్మద్ తన్విర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యఫై హాజరై దర్గాను దర్శించుకొని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ జిందే మధార్ షావాలి ఆశీస్సులతో లోక కల్యాణం జరగాలని, నియోజకవర్గ ప్రజలు ఆయుష్షు ఆరోగ్యాలతో ఉండి ప్రజల జీవితాలు సుఖ సంతోషాలతో గడవాలని వేడుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడంతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రజల పక్షాన పోరాడేందుకు మరింత బలాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. జాతర ఉత్సవ కమిటీ నిర్వహకుల్లో ఒకరైన మాజిద్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ పాష ఎమ్మెల్యే మణిక్‌రావు బృందానికి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ ఎంపీటీసీ-2 అబ్దుల్ హన్నాన్ జావిద్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ విజయ్ రాథోడ్, మచిరెడ్డి పల్లి మాజిద్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ పాష, బిజీ సందీప్, మొహమ్మద్ నవీద్, మొహమ్మద్ సమి, గోవర్ధన్ రెడ్డి, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ సాజిద్, మహబూబ్, సంతోష్‌కుమార్, అబ్దుల్లా సిద్దిఖీ, తయ్యబ్ అలీ పాల్గొన్నారు.

ఆక్సీగ్రేట్ క్లాసిక్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో ఆక్సీగ్రేట్ క్లాసిక్ డ్రింకింగ్ వాటర్ ప్లాంటును స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు.. టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యాఫైతో కలిసి ఆదివారం ప్రారం భించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎక్కడో తయారైన నీటిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తే వాటి ఖర్చు ఎక్కువగా ఉంటుంద కనుక.. ఇక్కడే ప్లాంట్ ఏర్పాటు చేసి మినరల్ వాటర్‌ను ప్రజలకు అందిస్తే.. అటు ఖర్చులతోపాటు, నాణ్యమైన నీరు అందుతుందన్నారు. ఈ మేరకు ప్లాంట్ ఏర్పాటు చేసిన ప్రొప్రైటర్ జహెద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ మాంకళ్ సుభాష్, పార్టీ మండల అధ్యక్షులు తట్టు నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మతీన్, రంగా అరుణ్, గోరేమియ, ఇబ్రహీం, జమీల్, మొహమ్మద్ అల్లి, వహీద్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాపాడదాం



నవతెలంగాణ-సంగారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళల హక్కులను కాపాడదాం అని.. సమాన పనికి సమాన వేతనం కోసం పోరాటం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రామిక మహిళలకు సమా న పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోషలిస్ట్ రష్యాలో విప్లవం విజయవంతం అయ్యాక 8 గంటల పని దినం అమ ల్లోకి వచ్చిందని.. మహిళలకు ఓటు హక్కు ఇచ్చిందన్నారు. మన దేశంలో శ్రమను గుర్తించాలని, మహి ళలకు ఉపాధి అవకా శాలు కల్పించాలన్నారు.కార్యక్రమంలో మనీ, పద్మమ్మ, రజిని, సుగుణ, నరసమ్మ, లక్ష్మీ, అలవేణి, వీరమని, సుజాత, మంజుల, రజిత, సులోచన, ఆశ, సుగుణమ్మ పాల్గొన్నారు.

జహీరాబాద్ ఎంపీగా భూపాల్‌రెడ్డి విజయం సాధించాలి



నవతెలంగాణ-కల్హేర్

బీఆర్ఎస్ కల్హేర్ మండలాధ్యక్షులు సంతోష్ కుమార్ శివమాల విరమణ సందర్భంగా శ్రీశైల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ఎన్నికై భారీ మెజార్టీతో విజయం సాధించాలని మల్లికార్జున స్వామి కోరుకున్నారు. ఈ నేపథ్యంలో స్వామివారి మహాప్రసాదాన్ని, స్వామివారి చిత్రపటాన్ని తీసుకుని.. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్వగ్రామమైన ఖానాపూర్(కె)లోని ఆయన నివాస గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు రామ్‌సింగ్, సంజీవరావు పాటిల్, నాయకులు యాదవరావు, సోషల్ మీడియా కన్వీనర్ ప్రమోద్ గౌడ్, రమేష్ నాయక్, కళ్యాణ్ నాయక్‌పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి ప్రధాత సావిత్రిబాయి ఫూలే

నవతెలంగాణ-సంగారెడ్డి

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలోని ఆమె విగ్రహానికి కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లా డుతూ.. సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని అన్నారు. పీడిత ప్రజలు.. ముఖ్యంగా స్త్రీల విద్యా భివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిణి అని కొనియాడారు. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి, మంచి వక్త, అని అన్నారు. నేటితరం మహిళలందరూ సావిత్రిబాయి పూలేని స్ఫూర్తిగా తీసుకొని ఆడపిల్లలందరినీ చదవనిద్దాం ఎదగనిద్దాం బతకనిద్దాం అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్నగౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, రంగారెడ్డి మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఉపా ధ్యక్ష ులు కృష్ణా గౌడ్, కార్యదర్శి హరీష్ గౌడ్, నాయ కులు కుమార్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : జోగిపేటలో సోమవారం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మాజీ మార్కెట్ చైర్మన్ డిబి.నాగభూషణం పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సంఘ సంస్కర్తలలో సావిత్రీ బాయి పూలే ఒకరని, తొలి ఆదర్శ ఉపాధ్యాయిని అన్నారు. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం ఎంతగానో పోరాడారని, సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశ చరిత్రలో ధ్రువతారగా వెలుగొందుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాకూర్ మాజీ సర్పంచ్ ఏ. శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని అంబేద్కర్ భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. అమృతత్వానికే అక్షరాన్ని అందించిన భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని కొని యాడారు. ఆమె ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తుకారం, మోహన్, రఘు, రహీం, పండరి, అంజా గౌడ్, భీమ్సేన తదితరులు పాల్గొన్నారు.







రథోత్సవంలో ఆవుల రాజిరెడ్డి, చిలుముల సుహాసిని రెడ్డి



నవతెలంగాణ చిలిపిచేడ్

మండలంలోని చండూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన రథోత్సవంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, చిలుముల సుహాసిని రెడ్డిలు పాల్గొన్నారు. చిలిపిచేడ్ మండలంలోనే అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ రథోత్సవంలో కార్యక్రమంలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి, వెల్దుర్తి ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, ఎంపీటీసీ సుభాష్ రెడ్డి, చిట్కుల్ విట్టల్ రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, బాగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా పూస సత్యనారాయణ



నవతెలంగాణ-మెదక్ : తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా పూస సత్యనారాయణ (గంగపుత్ర)ను నియమిస్తూ మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్‌లు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పూస సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఫెడరేషన్లకు పాలకమండలి వేయాలని, బడ్జెట్ కేటాయించాలన్నారు. ఫెడరేషన్‌లో ఉన్న కులాలు మేర, గంగపుత్ర, బొందిలి, దూదేకుల, ఆరెకటిక తదితర కులాలకు ఫెడరేషన్, పాలకమండలి ఏర్పాటు చేయాలని, బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ ఆదేశాల మేరకు ఫెడరేషన్ కులాల డిమాండ్లకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు. మెదక్ పార్లమెంట్ ఇన్చార్జిగా తనను ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన, సంఘసంస్కర్త, స్త్రీ విద్యాభి వృద్ధికి కృషిచేసిన దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యా యురాలు సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భం గా ఆదివారం బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జి. మాణయ్య, కె.విటల్, కే. వెంకట హరి హర కిషన్, చిలిపిశెట్టి మల్లయ్య పాల్గొన్నారు.

నవ తెలంగాణ-నిజాంపేట



అందరూ చదవాలి అందరూ సమానంగా బ్రతకాల ని సమసమాజ స్థాపన కోసం పోరాటం చేసిన వీర యోధురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియా డారు. మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ సమీపంలో ఆదివారం చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా స్త్రీల విద్యాభివృద్ధికి తోడ్పడిన ఆమె ఆశయాలను కొనసాగించాలన్నారు. మహిళలందరికీ విద్యను అందించాలని మానవులంతా సమానమే అని పురుషులతో సమానంగా స్త్రీలు విద్యను అభ్యసించాలని పోరాటం చేసిన మహాయోధురాలు అని గుర్తు పురుషాధిపత్యం కొనసాగుతున్న తరుణంలో స్త్రీల కోసం పోరాటం చేసిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో దుబాషి సంజీవ్, మాల మహానాడు మండల అధ్యక్షులు బండారి చంద్రయ్య, వేములవాడ నరసింహారెడ్డి, తిరుమల గౌడ్,బొమ్మెన మల్లేశం, తిరునహరి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్

నవతెలంగాణ-పాపన్నపేట



ఏడుపాయల వన దుర్గా మాతను ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ పూజారులు ఆమెను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దుర్గామాతను దర్శించుకోవడం జరుగుతుందని ప్రజలను సుఖ సంతోషాలతో ఉంచాలని అమ్మవారిని ప్రార్థించారని ఆమె తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ, జడ్పీటీసీ



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలో ఎంపీపీ చిందం సబితా రవీందర్, జెడ్పిటిసి బాణా పురం కృష్ణారెడ్డిలు ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపన చేశారు. మండల కేంద్రంలోని ఎంపీటీసీ 1కు సంబంధించిన రెండు, మూడు వార్డులలో భూగర్భ మురుగు కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. పెద్ద తండాలో ఐదు హెచ్.పి ల బోరు మోటారు, ఒకటి సింగల్ ఫేస్ మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ జడ్పీ నిధులు ద్వారా మండలానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని, అందులో నుంచి రూ.3.5 లక్షలు పాఠశాలకు, రూ.3 లక్షలు మురుగు కాలువల నిర్మాణానికి, లక్ష్మన్నర సంకాపూర్ తాండా కు లక్ష రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఒక కోటి 8 లక్షలు, ప్రతి గ్రామానికి రూ.15 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, మంజూరైన నిధులతో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీపీ నిధుల నుంచి ఎంపీటీసీలకు ఆరు లక్షలు అలాగే ఎస్సీ కాలనీలో బోరు మోటారు కొరకు మంజూరై పనులు చేసినందుకు ఎంపీపీ ఎంపీటీసీలకు కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి కొరకు అందరు నాయకులు కలిసికట్టుగా పనిచేసి మండల అభివృద్ధి చేసుకుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, పిఏసిఎస్ వైస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, పెద్ద తండా మాజీ సర్పంచ్ క్షత్రియ నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ కార్యదర్శి భూపతి రాజు, పెద్దదాండ పార్టీ గ్రామ అధ్యక్షుడు భాషా నాయక్, బిక్యా నాయక్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.


సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



నవతెలంగాణ-మెదక్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రెసిబిటరి ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఆరాధనల్లో భక్తులు పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొని గురువుల దైవసందేశాన్ని ఆలకించారు. ఏసు నామస్మరణలతో చర్చి ప్రాంగణం హోరెత్తింది. ఈ ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్, సువన్ డగ్లస్, నోబుల్‌సన్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట్

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న 50 మీటర్ల డ్రైనేజీ పనులకు ఎంపీపీ ప్రారంభోత్సవం చేశారు. ఈ పనులకుగాను రూ.1.71 లక్షలు మంజూరైనట్లు ఎంపీపీ సిద్ధ రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతి లక్ష్మా గౌడ్, పాగాల నగేష్,, దుబాసి సంజీవ్, దుర్గయ్య, మన్నె రమేష్, కాలనీవాసులు పోచవ్వ , లక్ష్మి, కోమ్మట పోశవ్వ , గంగవ్వ ,సురేష్ , రాజు తదితరులు పాల్గొన్నారు

ఏడుపాయలలో ఘనంగా రథోత్సవం

- ఉత్సాహంగా భక్తులబోనాలు
- వనంలో భక్తుల సందడి
- విందులతో సందడి చేసిన భక్తులు









నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల మహా జాతరలో చివరిరోజు రథోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రథాన్ని సుందరంగా రంగు రంగుల పువ్వులు, విద్యుత్ దీపాలు, కొబ్బరి మట్టలు, అరటి కొమ్మలు, దేవతా మూర్తుల చిత్రపటాలతో అలంకరించారు. ఆచారం ప్రకారం ఏడుపాయల పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఇఓ మోహన్ రెడ్డి నాగ్సాన్ పల్లి సాయిరెడ్డి ఇంటికి వెళ్లి రతోత్సవ ఆహ్వానం పలికారు. సాయంత్రం నాగ్సాన్ పల్లికి చెందిన 18 కులాలకు చెందిన పని బాటలవారు ఏడుపాయలకు వచ్చి, రథం ముందు పట్టు పరిచి, గుమ్మడి కాయలు, అన్నముతో ఆహుతి ఇచ్చి, కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు గర్భగుడిలో ఉన్న దుర్గమ్మ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, పల్లకిపై రథం వద్దకు తీసుకు వచ్చి రథంలో ఆసీనం చేశారు. రథానికి ఉన్న తాళ్లను లాగుతూ భక్తులు ముందుకు సాగారు. చుట్టు పక్కల ఉన్న వేలాది మంది భక్తులు చేసిన దుర్గానామ స్మరణతో ఏడుపాయల్లోని కొండా కోనలు ప్రతిధ్వనించాయి. రాజగోపురం ముందు నుంచి రథోత్సవం జరిగింది. మెదక్ డీఎస్పీ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఉత్సవం ముగిసింది.

విందు ఉత్సాహాలతో భక్తుల సందడి

పట్టణవాసులు బిజీబిజీగా గడుపుతూ అనుక్షణం తీరిక లేకుండా గడిపే పట్టణ వాసులు యేటా వేలాది మంది ఏడుపాయలకు బంధు, మిత్ర వర్గాలతో కలసి వచ్చి మూడు రోజుల పాటు అటవీ ప్రదేశంలో తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకుంటారు. వ్యాపారులు తమ లాభంలో కొంత భాగాన్ని తీసి ఏడుపాయల జాతర కోసం పక్కన పెడుతారు. శివరాత్రి రోజు శివదీక్షలు పూని, ఒక్క పొద్దులతో గడుపుతారు. మరునాడు బండ్లు తిరిగే రోజు నుంచి రెండు రోజుల పాటు బోనాలు తీసి, మేక పోతులు కోసి విందులు చేసుకుంటూ చిందులు వేస్తూ ధూం దాంగా గడుపుతారు. కొండా కోనల పక్కన, ఏడుపాయలుగా చీలి ప్రవహించే మంజీర గలగలలు, దట్టమైన అటవీ ప్రాంతం మధ్యన ,ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తు ఆనందంగా గడుపుతారు.



భక్తులను అలరించిన బిత్తిరి సత్తి

ఏడుపాయల జాతరలో ఆదివారం తెల్లవారు జాము వరకు బిత్తిరి సత్తి బృందం సందడి చేసింది. పాటలు, కామెడీ కార్యక్రమాలతో వేలాది మంది భక్తులను కడుపుబ్బ నవ్వించారు. జానపద గేయాలు నృత్యాలతో భక్తులను ఉర్రూతలూగించారు. జోగిని శ్యామల, రాధిక, పావని బోనాలు తీసి, చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



కొండపోచమ్మ నీళ్లు కొన్ని గ్రామాల కేనా?

- మండుతున్న ఎండలు,
- ఎండుతున్న పంటలు, ఏడుస్తున్న రైతులు
- నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యానికి బలైన రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు



నవతెలంగాణ-నిజాంపేట

పంటలు పండించడానికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం జరిగింది. అందులో భాగంగానే నిజాంపేట మండలానికి కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని విడుదల చేసి గత సంవత్సరం కొన్ని చెరువులను నింపారు. ప్రస్తుత సంవత్సరం కొండపోచమ్మ నీటితో పులిమామిడి చెరువు నింపారు. పులిమామిడి చెరువులో నుంచి కే వెంకటాపూర్ గ్రామ చెరువు నింపినట్లైతే వెంకటాపూర్ గ్రామ వరి పంటలు మొక్కజొన్నలు ఎండిపోయేవి కావని రైతులు పేర్కొంటున్నారు. పూర్తిగా భూగర్భ జలాలు అడుగంటి పోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిక్కుతోచక రైతులు ఎండిపోయిన పంటలను మేకలకు, పశువుల మేతకు ఉపయోగిస్తున్నారు. కే వెంకటాపూర్ తండావాసులు పులి మామిడి చెరువు నీరు విడుదల చేయాలని ఎన్నిసార్లు నీటిపారుదల శాఖ అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఏ అధికారి కూడా నీటిని విడుదల చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క వెంకటాపూర్ గ్రామం, లంబాడా తాండలలో దాదాపు 60 ఎకరాల వరకు పంటలు ఎండిపోయాయని రైతులు స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు సమయానికి నీటిని విడుదల చేసినట్లయితే పంటలు చేతికొచ్చేవని, ఇప్పుడు వేల రూపాయల కొద్దీ నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పులిమామిడి చెరువులో నుంచి నీటిని విడుదల చేసినట్లయితే ఇంకా కొన్ని పంటలు బాగుంటాయన్నారు. నిజాంపేట మండల నీటిపారుదల శాఖ ఏఈని వివరణ కోరగా కొండపోచమ్మ సాగర్‌కు నీటిపారుదల శాఖ అధికారులు ఉంటారని, కొండపోచమ్మ సాగర్ కాల్వకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ కాలువకు అధికారులు ఉంటారని నిజాంపేట మండల ఏఈ సమాధానం చెప్పారు.



పొలాలు ఎండిపోతున్నాయి ప్రభుత్వమే ఆదుకోవాలి

బానోతు రవీందర్, కె వెంకటాపూర్ తాండ



చెరువులలో నీరు లేక బోరు మోటార్లు ఎత్తిపోవడంతో వరి పంట పొలాలు మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఎన్ని బోర్లు వేసినా సుక్క నీరు రావడంలేదని 400 ఫీట్ల వరకు బోర్లు వేసామని అప్పుల పాలయ్యామని ప్రభుత్వమే ఆదుకోవాలి.

పులిమామిడి చెరువు నుంచి నీటిని విడుదల చేయాలి

మూడవత్ రాజేందర్. కే వెంకటాపూర్ తండా



పులిమామిడి చెరువుల నుంచి వెంకటాపూర్ తండా చెరువును నింపాలని అధికారులను కోరినా వారు పట్టించుకోకపోవడం వల్లనే పంటలు ఎండిపోతున్నాయి. మా తాండవాసులం పులిమామిడి చెరువు దగ్గరికి పోతే పులిమామిడి గ్రామవాసులు మాతో జగడం పెట్టుకుని నీరు విడుదల చేయనీయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పులిమామిడి చెరువు నుంచి నీటిని విడుదల చేయాలి.

సావిత్రి బాయి పూలే త్యాగం మరువలేనిది









నవ తెలంగాణ-సిద్దిపేట

సావిత్రిబాయి పూలే వర్ధంతిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి డేవిడ్ మాట్లాడుతూ భారతదేశ తొలి పంతులమ్మ అని, స్త్రీ, పురుష లింగ వివక్షతను వ్యతిరేకించి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి పాటుపడిన మహోన్నతురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేవిడ్, రోహిత్, హరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్

సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా మండలంలో ఎమ్ జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గర్జకుంట రామస్వామి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యాతిథిగా రాష్ట్ర కార్యదర్శి మరాఠీ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గర్జకుంట రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి మరాఠీ కృష్ణమూర్తిలు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జీవితం నేటికి అందరికి ఆదర్శమన్నారు. బడుగు బలహీన వర్గాల మహిళాలకు చదువు నేర్పిన తల్లి సావిత్రి బాయి పూలే అని అన్నారు. మహిళల అభ్యున్నతికి కృషి చేసిన చదువుల తల్లి అని కొనియాడారు. ప్రతి మహిళ చదువుకోవడం ఆమె ఆశయంగా పెట్టుకుని ముందుకు వెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో మునిగడప మాజీ సర్పంచ్లు బాల్ లక్ష్మీ ఐలయ్య,రాజమని ఇదిలింగం, చంద్రమౌళి, ఎమ్ జే ఎఫ్ సభ్యులు భాస్కర్, నాయకులు సత్యం, ఇదయ్య,అనిల్, నర్సింలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మన తొలి తరాలకు ఉపాధ్యాయురాలుగా నిలిచిన సావిత్రిబాయి పూలే జీవితాన్ని, ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బి ఎస్పి జిల్లా కార్యదర్శి ఎలగందుల శంకర్, బి ఎస్ పి మండల అధ్యక్షులు వేల్పుల రాజు, శరత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

మాత సావిత్రి భాయ్ పూలే వర్ధంతి సందర్భంగా కొడకండ్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చందా ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ ఎడ్ల భూమయ్య, ప్రధాన కార్యదర్శి బందేల కరుణాకర్,మాజీ అధ్యక్షులు కోడిసెల గిరిబాబు,దొడ్డి ముకేశ్, సంఘం సభ్యులు కుక్కల ప్రవీణ్, కోడిసెల బాలచంద్రం,మిందే ప్రవీణ్,కోడిసెల భాను, కుక్కల సుధాకర్, ప్రశాంత్ తలారి తదితరులు పాల్గొన్నారు.

డిబిఎఫ్ ఆధ్వర్యంలో..

ప్రముఖ సంఘ సంస్కర్త, భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని, ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా గజ్వేల్‌లో, అనంతరావుపల్లిలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, ఉద్యోగ, రాజకీయరంగాలలో పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతమ్మ, నర్సవ్వ, జ్యోత్స్న, పవిత్ర, రిత్విక్, దుర్గా ప్రసాద్, బాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముప్పై ఆరు వసంతాల ముచ్చటైన కలయిక

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ -నంగునూరు : మండల కేంద్రమైన నంగునూరు ఉన్నత పాఠశాలలో 1987-1988సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట సమావేశమయ్యారు. వారికి చదువు చెప్పిన గురువుల సమక్షంలో యోగ క్షేమాలు తెలుసుకొన్నారు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకొన్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు నరసింహ్మా స్వామి, ఇ.రామచంద్ర రెడ్డి, ఎస్.నారాయణ రెడ్డి, ఎ. ముకుందం, పూర్వ విద్యార్థులు అదిరాల సాయినాథ్ శర్మ తిప్పని రమేశ్, కత్తుల రాంరెడ్డి, రాపోలు రాజ బహదూర్ రెడ్డి, జాగీరు ఎల్లా గౌడ్, కుందేటి రవి,దేవులపల్లి నర్సింగా రావు, అల్లూరి విజేందర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, వల్లపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాం రెడ్డి, శ్రీ విద్య సుగుణ, తార, రాజా శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ సేవలు గజ్వేల్‌కు అవసరం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ సేవలు గజ్వేల్ ప్రాంతానికి అవసరమని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డిలు అన్నారు. ఇటీవల గుండె ఆపరేషన్ అయిన మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కంను ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి పరమార్శించారు. గాడిపల్లి భాస్కర్‌కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మైపాల్ రెడ్డి, యాద గౌడ్, నాయిని యాదగిరి, నరేందర్ రెడ్డి, నక్క రాములు గౌడ్, అస్గర్, మొనగారి రాజు, పంజాల రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర ఏండ్ల బాలుడికి హేర్నియా ఆపరేషన్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేటలోని సిరి చిల్డ్రన్ హాస్పిటల్‌లో సిద్దిపేట పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే రెండున్నర సంవత్సరాల బాలుడికి హెర్నియా ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి రాం, డాక్టర్ దీపక్ రెడ్డిలు మాట్లాడుతూ ఇంత చిన్న వయస్సులో ఇటువంటి సమస్యలు రావడం చాలా అరుదని. అందులో ఇంత చిన్న పిల్లలకు ఆపరేషన్ చేయడం కూడా చాలా కష్టతరమన్నారు. కడుపు నొప్పితో వచ్చిన బాలుడికి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ అవసరమని గుర్తించి, సుమారు మూడు గంటల పాటు కష్టపడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి బాలుడి పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. హాస్పిటల్ ఎండి ఇమ్రాన్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నెట్ బాల్ పోటీలకు నిఖిల్ ఎంపిక



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో మల్లన్న సాగర్ కాలనీ చెందిన నెట్ బాల్ క్రీడాకారుడు నిఖిల్ ఈ నెల 5న జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన నెట్ బాల్ క్రీడోత్సవాల్లో ప్రతిభ చాటారు. ఇందులో భాగంగానే ఆల్ ఇండియా నెట్ బాల్ పోటీలకు నిఖిల్ ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్చి 12 నుంచి 15 వరకు సిద్దార్థ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ కర్ణాటక రాష్ట్రంలో ఆగల కోట్‌లో నిర్వహించే ఆల్ ఇండియా నెట్ బాల్ పోటీల్లో అవకాశం వచ్చిందని పిఈటి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం లయోలా డిగ్రీ పీజీ కళాశాలలో నిఖిల్ బిఎస్సి కోర్సు అభ్యసిస్తున్నారు.

చింత కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

చింత కుమార్ కుటుంబాన్ని చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. శనివారం రాత్రి మండల కేంద్రానికి చెందిన చింత కుమార్ అప్పులు పెరిగిపోయి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం రాత్రి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు పాగాల కొండల్ రెడ్డి, కొంగరి నర్సింలు, నాయకులు భూస నిరంజన్ రెడ్డి, రేపాక తిరుపతి తదితరులు ఉన్నారు.

లిటిల్ ఫ్లవర్ విద్యార్థులకు అవార్డులు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని పాలమాకుల లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం రవీంద్ర భారతిలో దీపిక చిల్డ్రన్స్ లీగ్ అవా ర్డులు పొందారు. 2024 సంవత్స రానికిగాను మంత్రి జూపల్లి కృష్ణారావు, హీరో సుమన్ చేతుల మీదుగా అవా ర్డులు అందుకున్నారు. వి. శ్రీజ నేషనల్ సెకండ్ ర్యాంక్ సాధించి క్యాష్ అవార్డు అందుకున్నారు. రుత్వికాశ్రీ, అభిజ్ఞా, ఆరోణ్, భరత్,జాషిద్, సాయిమన్విత్, హర్షిణి, సంజిత్‌లు అవార్డులకు సైతం ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.వర్గీస్, పాఠశాల డైరెక్టర్ పట్నోజు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరా స్వామిని దర్శించుకున్న శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

త్రిలింగేశ్వరా స్వామిని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి దర్శిం చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి మండలం ఎల్లారెడ్డి పేట గ్రామంలో శ్రీ త్రిలిం గేశ్వరా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ ఎంపీపీ గంట రేణుక రవీం దర్, మాజీ సర్పంచ్‌లు బుర్ర అనిత నర్సింహులు, పాగాలా కొండల్ రెడ్డి, జిల్లా నాయకులు యెన్నం భూపాల్ రెడ్డి, భూస నిరంజన్ రెడ్డి, కణికి స్వామి, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-మర్కుక్

ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం మండలంలోని పాములపర్తి గ్రామానికి సాకలి బుచ్చమ్మ బట్టలను ఇస్త్రీ చేస్తూ జీవనం కొనసాగిస్తుంది.శనివారం రాత్రి ప్రమాద వశాత్తు విద్యుదాఘాతానికి గురై ఇంట్లో ఇస్త్రీ చేయడానికి ఇచ్చిన పట్టు చీరలు, బట్టలు, వస్తువులతో పాటు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు బోరున విలపించింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బాధితురాలికి సాయం..



మర్కుక్ మండల భారతీయ జనతా పార్టీ నాయకులు, మర్కుక్ మాజీ ఎంపీటీసీ గీతా రామ్ రెడ్డి, మహేష్ గౌడ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, రాజు, బొమ్మ స్వామి, పాములపర్తి, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటనపై హర్షం



నవతెలంగాణ-బెజ్జంకి

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 21 శాతం పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటనపై మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, అయా గ్రామాల కార్యకర్తలు హజరయ్యారు.

14న మండల సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన ఈ నెల 14వ తేదిన ఉదయం 11. గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు. సంబందిత అధికారులు తమ శాఖలకు పూర్తి వివరాల నివేదికను ఈనెల 12లోగా 25 సెట్లు ఎంపీడీవో కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యే ఈ సవమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

బీడీఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

సూర్యాపేటలో జరుగు బహుజన మహా సభ రాష్ట్ర ప్రథమ మహాసభలకు సిద్దిపేట నుంచి నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బీడీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బేట ఆనంద్ మాట్లాడుతూ మహాసభలకు సిద్దిపేట నుంచి వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివరాత్రి శ్రీనివాస్, మురళీకృష్ణ, సాయి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటి పోతున్న భూగర్భ జలాలు

ఎండుతున్న పంటలు





నవతెలంగాణ-నంగునూరు

ఆరుగాలం కష్టించి పండించిన పంటలు నీరు సమృద్ధిగా లేక ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నీరు లేక వరిపొలాలు ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలి పెడుతున్నారు.గత ప్రభుత్వం ఎండాకాలంలో రంగనాయక్ సాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో పంటలకు నీరు సమృద్ధిగా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు నీటి ఎద్దడి నెలకొందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ సిద్దిపేటలో రంగనాయక్ సాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో పంటల సాగుకు అనుకూలంగా ఉంటోందని రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఎట్టకేలకు రంగనాయక్ సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని రంగనాయక్ సాగర్ కుడి కాలువ పనులు పూర్తి కాకపోవడంతో కొన్ని గ్రామాలకు మాత్రమే నీరు వస్తోంది. మండలానికి పూర్తిగా సాగు నీరు విడుదల చేయకపోవడం వల్ల కాల్వలేని కాళేశ్వరం ప్రాజెక్టు పనుల వల్ల పంటలకు పూర్తి నష్టం వాటిల్లిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో వరి పంట సాగు చేసిన రైతులు మోదిపురుగు సోకడం వల్ల పంటలకు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటపొలాలను సందర్శించి రైతులకు మోదిపురుగు సోకడం వల్ల పంటలకు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రహించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేలకు వేలు ఖర్చు చేసి రసాయన మందులు వాడటం వల్ల తీవ్రంగా పంటలు నష్టపోతున్నారని గ్రహించి నివారణ చర్యల కోసం వరి పంటలో పూర్తిగా నీటిని వదిలి మరల నీటిని పెట్టాలని చెప్పడంతో అడుగంటుతున్న భూగర్భ జలాలతో మరో సమస్య ఉత్పన్నమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు కాపాడుకునేందుకు రైతులు శత విధాల ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో కరెంట్ సరఫరా రాత్రి పది గంటల నుంచి సరఫరా అయ్యేది. ప్రస్తుతం రాత్రి పదకొండు తర్వాత ఎప్పుడు వస్తుందో సబ్ స్టేషన్ ఆపరేటర్‌కే మేసేజ్ వస్తుందని రైతులు చర్చించుకుంటున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో రాదో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని రైతులు వాపోతున్నారు. ఎండలు ముదరడంతో లోవోల్టేజ్ సమస్యలు రావడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళ్యాణం కమనీయం





కన్నుల పండుగగా ఉమామహేశ్వర కళ్యాణం

విశేష సంఖ్యలో హాజరైన భక్తులు



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలో అంగడి కిష్టాపూర్ గ్రామంలో గల ఉమామహేశ్వర కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కనుల పండువగా సాగింది. ఉదయం ప్రాతఃకాల పూజ, హవనము, ధ్వజారోహణము, గరుడ ప్రసాద వితరణ, నందివాహన సేవ, యెదుర్కోళ్ళు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ధర్మ కర్త కప్పర శైలజా మోహన్ రావు దంపతులచే, ఆలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్ గుప్త,తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మి రాములు గౌడ్, ఎంపిటీసి గోలి నరేందర్, ప్రదాన అర్చకులు వెంకట నర్సింహ్మా శర్మ, సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి పట్టువస్త్రాలను గోలి జ్యోతి నరేందర్ దంపతులు సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, జవహర్ నగర్ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ గుప్తా , అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక సహాయకులు లింగమూర్తి, వీరేశం, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, అయల కమిటీ సభ్యులు కె.మహేందర్ రెడ్డి, దుద్దెడ నర్సింలు గౌడ్, కమ్మరి లక్ష్మణ్, లింగని రాములు, మర్కుక్ మండలాధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, నాయకులు మీసాల శ్రీనివాస్ రెడ్డి, కంది నరసింహ చారి, ముద్రాతి బాల్ రెడ్డి, గుడాల ఆశోక్ గుప్తా,, సేవాదళ్ సభ్యులు అంజనేయులు, కుమ్మరి కనకయ్య, సుదర్శన్ గౌడ్, రాము గౌడ్, వెంకటేష్, నరసింహ చారి, శ్రీనివాస్, గడీల వెంకట్, తిరుపతి, రుక్మారెడ్డి, శ్రీదర్ రెడ్డి, నాగరాజ, నాగేష్, లింగని నాగ రాజు, మహేష్, పి.వెంకటేష్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం



నవతెలంగాణ-గజ్వేల్

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రజ్ఞాపూర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెంవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజలు ఇప్పుడిప్పుడే గమనిస్తున్నారని అక్రమాలు అవినీతిని ప్రజలు ప్రశ్నించే రోజులు వస్తున్నాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ స్థానాలను గెలిచేందుకు కృషి చేస్తామన్నారు. రాజీవ్ రహదారి విస్తరణ ఆలోచన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జేబీఎస్ నుంచి బొల్లారం, అల్వాల మీదుగా రోడ్డు విస్తరణ జరగనున్నదని ప్రయాణికులకు ఎంతో ఉల్లాసంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకుండా రాద్దాంతాలకు పోయి అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు.

ఆరు గ్యారెంటీలతో అభివృద్ధి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీల పథకాల అభివృద్ధిని చూసి ప్రజలు స్వాగతిస్తున్నారని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎల్లారెడ్డి, రాజిరెడ్డి, మాధవరెడ్డి, జంగం వీరేశం,యాదయ్య నర్సింలు, పరశురాములు, రంజిత్ కుమార్ పలువురు నాయకులకు పూజల హరికృష్ణ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరా ్వత ఎక్కడ చూసినా చేరికల కార్యక్రమాలు జరుగుతు న్నాయన్నారు. గత తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ పాలన లో ఏ ఒక్క వర్గం ప్రజలకు కూడా న్యాయం జరగలేదన్నారు. సిదిపేట నియోజకవర్గంలో రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పెద్ద ఎత్తున చేరికలు జరుగుతా యనాన్నారు. ప్రజలకు కష్టం వచ్చినా నష్టం వచ్చిన నిత్య అం దబాటులో ఉండి సమస్యలు తీర్చడం జరుగు తుందన్నారు. చిన్నగుండవెల్లి గ్రామ రెడ్డి సంఘానికి జిల్లా ఇన్చార్జి మం త్రి కొండ సురేఖ ద్వారా రూ.10 లక్షలు ఇపి ప్పిస్తానని హామీ ఇచ్చారు. మీరు ఎలాంటి ఆధర్య పడొద్దని, ప్రభుత్వం. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎప్పుడు తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రాములు, అంజిరెడ్డి మహిపాల్‌రెడ్డి, రాములన్న, వెంకటన్న పద్మా రెడ్డి ,మల్లారెడ్డి,శ్రీనివాసరెడ్డి పుల్లూరు టెంపుల్ చైర్మన్ కనుకయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో రాణించిన సిద్దిపేట విద్యార్థులు



నవతెలంగాణ-సిద్దిపేట

హుస్నాబాద్ పట్టణములో ఆదివారం జరిగిన హుస్నాబాద్ హాఫ్ మారథాన్ నాలుగవ ఎడిషన్‌లో సిద్దిపేట విద్యార్థులు నగదు బహుమతిని అందుకున్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదగా విద్యార్థులు బహుమతులను అందుకున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ సుజాత పాతూరి తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న బి.హారిక 10 కి మీ పరుగు పందెంలో మహిళా విభాగంలో 3వ స్థానంలో, 5 కిలోమీటర్ల మహిళా విభాగంలో బి ఇందు 3వ స్థానంలో నిలిచి నగదు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. విజేతలుగా శిక్షణ ఇచ్చిన తనను, పీ ఈ టీ సువర్ణ లత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయలను మంత్రి అభినందించినట్లు తెలిపారు.

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ -నంగునూరు

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నంగునూరు మండలంలో 20 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు ప్రధాన పంటలుగా ఉన్నాయని ఎక్కువభాగం బోర్లు వ్యవసాయ బావుల ఆధారంగా పంటలు పండుతాయన్నారు. వర్షాలు లేక, బోర్లు బావుల కింద రైతులు సాగు చేస్తున్న వరి పొలాలు పొట్ట దశలో, కంకి దశలో ఉన్నాయని ఇప్పటికే మూడు మీటర్ల లోతులో భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల బోర్లు, బావులు ఎండిపోతున్నాయన్నారు. రైతులు ఇప్పటికే ఎకరాకు పాతిక వేల చొప్పున పెట్టుబడులు పెట్టి పూర్తిగా నష్టపోయారని, నీరు లేక కళ్ళముందే వరిపొలాలు ఎండిపోతుంటే రైతులు ఆవేదన చెందుతున్నారని, గత్యంతరం లేక పశువులను మేపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు పూర్తిగా అడుగంటిపోయాయని, నంగునూరు మండలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని, మూగజీవాలు అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రాజెక్టు ద్వారా చెరువులను కుంటలను నింపాలని, తద్వారా భూగర్భ జలాలు పెరిగి సాగు, త్రాగు నీటి కొరత నుండి అరికట్టి ప్రజలను, రైతుల పంట పొలాలను కాపాడాలని కోరారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలకు సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి ఎకరాకు రూ.50 వేల చొప్పు పంట నష్ట పరిహారాన్ని అందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం నుంచి గజ్వేల్‌కు గోటి తలంబ్రాలు



నవతెలంగాణ-గజ్వేల్

భద్రాచల దేవస్థానం నుంచి ఆదివారం గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజానికి అందిన 150కిలోల గోటి తలంబ్రాలకు అద్దాల మందిరం వద్ద ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు సంస్థ అధ్యకులు రామకోటి రామరాజు. అనంతరం ఓడ్లను ప్యాకెట్లుగా తయారుచేశారు. భక్తులందరికి అందించడానికి. సిద్ధం చేస్తున్నామని రామకోటి రామరాజు తెలిపారు. భక్తులందరూ కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొని రామకోటి సంస్థ అందించే గోటి తలంబ్రాలలో పాల్గొని రామనామాన్ని స్మరిస్తూ వొలిచి తమకు అంది ంచాలని కోరారు. గత సంవత్సరం 30 వేల మంది భక్తులు పాల్గొన్నారని,ఈయేడు లక్షమంది భక్తులను పాల్గొని తరించేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు.

దూల్మిట్టలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1998-99 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు. 25 సంవత్సరాల తర్వాత సిల్వర్ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా శాలువా మెమెంటోలతో సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు చదువుకున్నప్పటి రోజులను తీపి గుర్తులు నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సుధాకర్ శర్మ రామలింగం, దుబ్బుడు పాపిరెడ్డి, గూడ మల్లారెడ్డి,జి రాములు, దశరథం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

ఉపాధి హామీ చట్టం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మద్దూరు ఎంపిటిసి బొప్ప కనకమ్మ నాగయ్య కోరారు. ఆదివారం మద్దూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ చట్టంలో 2023 - 24 సంవత్సరంలో జరిగిన పనులపై ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పి యాకూబ్, గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో జరిగిన పనుల వివరాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీటీసీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు ఎక్కువ జరిగితే గ్రామానికి కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కె జనార్దన్ రెడ్డి, టి ఏ మాధవి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

మర్మముల గ్రామ గౌడ సంఘం ఎన్నిక



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని మర్మముల గ్రామ గౌడ సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షునిగా ఉత్కం ఆంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షుడిగా సుందరగిరి బాలకిషన్ గౌడ్, డైరెక్టర్స్‌గా సుందరగిరి సిద్దిరాజయ్య గౌడ్, ఉట్కూరు వెంకట్ గౌడ్, బత్తిని కనకయ్య గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్తుల అభివృద్ధికి పాటు పడతామన్నారు.

కొమురవెల్లిలో కొమ్మూరి బస చేసిన వివరాలు వెల్లడించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

నవ తెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లి మల్లన్న ఆలయ గెస్ట్ హౌస్‌లో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి బస చేసిన వివరాలు బహిర్గతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ అధికారం పేరుతో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆలయ గెస్ట్ హౌస్‌లను తనకు ఇష్టం వచ్చినట్లు వాడుకుంటున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓటమి చెందిన ప్రతాపరెడ్డి ప్రవర్తనలో అనేక మార్పులు వచ్చాయని దీంతో ఈ ప్రాంత అభివృద్ధిని మరిచిపోయి అపరిచితుని వలె ప్రవర్తిస్తున్నాడన్నారు కొమురవెల్లిలో ఆయన రెండు రోజులు చేసిన బసపై సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తాడూరి భరత్, నాయకులు తాడూరి విక్రమ్, బాబు, రాఘవ, శివ, అరవింద్, సాయి, అఖిల్ , భాను, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవి ముంపు గ్రామస్తులకే ఇవ్వాలి

నవతెలంగాణ-ములుగు



మండల పరిధిలోని పంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి గ్రామస్తులకు ఇవ్వాలని బైలంపూర్ గ్రామానికి చెందిన గొల్లపల్లి శేఖర్ అన్నాడు. తన భార్య గొల్లపల్లి పావని విద్యావంతురాలని అలాగే మా కుటుంబం మొత్తం పార్టీ కోసం పనిచేశామని. గతంలో కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ నాయకులు తనపై కేసులు పెట్టి దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని ఉన్న పార్టీ కోసం కష్టపడినందుకు గుర్తించాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు కాబట్టి ముంపు గ్రామం యువతను ప్రోత్సహించి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించాలని నాయకులను డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డిని కోరారు.

వరితో అంతర పంటలు వేస్తే అధిక లాభాలు

గో ఆధారిత వ్యవసాయమే రైతులకు మేలు

సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విజయ్ రామ్

నవ తెలంగాణ -దుబ్బాక



రైతులు వరితో ఇతర అంతర పంటలను వేయడం ద్వారా అధిక లాభాలు గడించవచ్చని ఇందుకు గో ఆధారిత వ్యవసాయమే రైతులకు మేలుదాయకమని వికారాబాద్‌కు చెందిన సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విజయ్ రామ్ చెప్పారు.ఆరోగ్యం కంటే డబ్బు ముఖ్యం కాదని, సేంద్రీయ జీవామృతంతో సాగుచేసిన ఆహార పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చన్నారు.ఆదివారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో "గో ఆధారిత వ్యవసాయ సాగు పద్ధతిలో లాభాలు గడించడం ఎలా" అన్న అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నేడు పండిస్తున్న పంటలు హైబ్రీడ్ విత్తనాలతో ఎలాంటి పోషక విలువలు లేని ఆహారం పండిస్తున్నారని,రసాయన మందుల ఆహారం తిని మనం అనేక రోగాలాబారిన పడ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా మనకున్న భూమిలోనే కొంతమేర నీటి నిల్వ కోసం కుంట వలే తవ్వుకోవాలన్నారు.వరి చేల చుట్టూ పొలం గట్లను 5 అడుగుల వెడల్పు ,2 అడుగుల ఎత్తులో నిర్మించుకోవాలని సూచించారు.ఇలా ఏర్పాటు చేసుకున్న గట్లపై ప్రతి ఏడడుగులకు 1 అరటి మొక్కను మధ్య మధ్యలో 2 మునగ మొక్కలను వాటి మధ్యలో అల్లం,కందగడ్డ,పసుపు,చక్రకేళి,తమలపాకు తీగ వంటి అంతర పంటలను పండించుకోవాలన్నారు.వరిపైరులో ఉండే నీటి తేమతోనే ఈ అంతర పంటలు విరివిగా పండుతాయాన్నారు.అరటి గెలలు,పసుపు కొమ్ములు,తమలపాకులు,మునగ కాయలు,మునగ ఆకుల పొడి, ఎక్కువ భూమి ఉన్నవారు వీలైతే కూరగాయలు కూడా పండించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు.ఇలాంటి విలువ ఆధారిత వ్యవసాయం రైతుల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. రైతులు కేవలం వరిపై ఆధారపడకుండా అంతర పంటల ద్వారా అధిక లాభాలు గడించవచ్చునని, అయితే వీటికి పెస్టిసైడ్స్,రసాయనాలు వినియోగించకుండా శనగపిండి,ఆవు మూత్రము,పేడ,బెల్లం, పల్లిపిండి కలిపిన ఘన జీవామృతం వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చున్నారు.ఇలాంటి లాభదాయక వ్యవసాయ పద్ధతుల్ని ప్రతి రైతు పాటించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ ఛైర్మెన్ వడ్లకొండ శ్రీధర్,ఫౌండర్స్ చింత రాజు పలువురు సేవ్ వ్యవస్థాపకులు విజయ్ రామ్ ను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ అవగాహన సదస్సులో ,ఉమా మహేశ్వర్,చింత నాగేందర్,కూర వేణుగోపాల్,రాజమౌళి గుప్తా,చింత శ్రీనివాస్,సురభి సంస్థ అధినేత సాయి సుమన్,పలువురు రైతులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



నవతెలంగాణ -నంగునూరు

పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తూ, రానున్న ఎన్నికల్లో బీజేపీ లోకసభ అభ్యర్థులను గెలిపించాలని మండల బీజేపీ అధ్యక్షుడు చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి కోరారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో బీజేపీ అనుబంధ కమిటీల నియామకాలు చేపట్టారు. అధ్యక్షుడు ఇది వరకే ఎన్నిక కాగా మండల నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పేరాల తిరుపతిరావు, జిల్లా నాయకులు వాసర యాదమల్లు, రజనీకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, నర్సింహారెడ్డి, మండలానికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షులుగా రాంరెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



భారతీయ జనతా పార్టీ మర్కుక్ మండలాధ్యక్షునిగా మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి రాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాంరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డికి, ఎన్నికకు సహరించిన జిల్లా, మండల, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తాని ఆయన తెలిపారు.

నారాయణరావుపేట బీజేపీ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారాయణరావుపేట బీజేపీ మండల నూతన అధ్యక్షులుగా పొన్నలబాబును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల ఉపాధ్యక్షులుగా కోడి కనకయ్య, గడ్డం స్వామినాథ్ గౌడ్, సొప్పరి బాబు, గోల్కొండ భాస్కర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా,గడ్డం శ్రీకాంత్ గౌడ్, బోయిని బాలు, మహిళ మోర్చా అధ్యక్షులుగా ,గోల్కొండ లతా రెడ్డి బీజేవైఎం అధ్యక్షులు అప్పనపల్లి కర్ణకర్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం సిద్దిపేట జిల్లా బిజెపి అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానమంత్రిగా కావాలని 140 కోట్ల జనాభా యావత్ భారత దేశమే మోడీ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో నారాయణరావుపేట మండలంలో అత్యధికంగా భారీ మెజార్టీతో ఓట్లు వచ్చే విధంగా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు తెలియపరచాలని సూచించారు.

బీజేపీ మండలాల అధ్యక్షుల నియామకం

నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లాలోని వివిధ మండలాలకు భారతీయ జనతా పార్టీ అధ్యక్షులను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా దేవులపల్లి మనోహర్ యాదవ్, జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడిగా మంద ఐలయ్య, కొండపాక మండల అధ్యక్షుడిగా నీల సత్యం, కుకునూరు పల్లి మండల అధ్యక్షుడిగా అనుముల సంపత్ రెడ్డి, ములుగు మండల అధ్యక్షుడిగా మన్నె శ్రీనివాస్, మర్కుక్ మండల అధ్యక్షుడిగా సాయి రెడ్డి రాంరెడ్డిలను నియమించినట్టు తెలిపారు.

నిరుపేదల సొంతఇంటి కల నెరవేరేనా ?

సొంతజాగ ఉన్నవారికే తొలిదశలో ప్రాధాన్యం

నేడే ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కోహెడ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేడు ఇందిరమ్మ సొంతింటి కలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో నిరుపేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ తెచ్చిన ఆరు గ్యారంటీలలో ఇందిరమ్మ ఇండ్లు కూడ ఒకటి. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో మరో పథకాన్ని ప్రభుత్వం అమలు చెసేందుకు ముందుకు వచ్చింది. తొలిదశలో సొంత జాగ ఉన్నవారికి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వడం రానున్న రోజులలో ఇంటి స్థలం లేనివారికి సొంత జాగను ఇచ్చి ఆర్థికసాయం చెసేందుకు ప్రభుత్వం చూస్తున్నట్లు సమాచారం. అలాగే గత బీఆర్ఎస్ పాలనలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లను మంజూరి చేసినప్పటికి మండలంలో ఒక్క ఇంటినైనా నిర్మించలేకపోయింది. శనిగరం, ఆరెపల్లి గ్రామాలలో నిర్మించేందుకు చర్యలు తీసుకున్నప్పటికి పలు సమస్యలతో అవి అర్థంతరంగానే ఆగిపోయాయి. సొంత ఇల్లు లేక పూరి గుడిసెలలో నివసిస్తున్న నిరుపేదలకు ఇంటి నిర్మాణం అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇండ్లను నేడు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్నందున మండలంలో నిరుపేదలైన వారికి అందాలని పలువురు కోరుకుంటున్నారు. అయితే లబ్దిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారనేది నేడు తేలాల్సిఉంది. అలాగే గతంలో ఇందిరమ్మ ఇండ్లు పొందని వారు, సొంత జాగ ఉండి ఎలాంటి ఇంటి నిర్మాణం చేయనివారు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు పొందని వారిని పరిగణలోకి తీసుకోవాలని గైడ్‌లైన్స్‌లో తెలుస్తుంది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం రూ.5 లక్షలను అందిస్తున్నందున లబ్దిదారులు తమ ఇష్టం వచ్చిన రీతిలో సొంతింటిని నిర్మించుకునే అవకాశం ఉంది. అలాగే మండలంలో గత పది సంవత్సరాలుగా ఒక్క డబుల్‌బెడ్‌రూం అందని పరిస్థితి ఉన్నందున రవాణశాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గానికి రానున్న 3500 ఇండ్ల నిర్మాణంలో కోహెడ మండలానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలు సిద్ధమవ్వాలి

నవ తెలంగాణ- రాయపోల్



రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కోసం బిజెపి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బిజెపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాయపోల్ బిజెపి మండల నూతన అధ్యక్షులు రాజా గౌడ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఎనిమిది సంవత్సరాలుగా మండల అధ్యక్షులుగా పనిచేస్తూ పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన మాదాస్ వెంకట్ గౌడ్ ను, నూతనంగా ఎన్నికైన రాయపోల్ మండల అధ్యక్షులు రాజాగారి రాజా గౌడ్ ఇద్దరినీ ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మెదక్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడానికి రాయపోల్ మండలంలోని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. గత రెండు పర్యాయాలు దేశంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారని, కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయి వరకు తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో ఓటమి కారణాలు తెలుసుకొని, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రపంచంలోనే భారతదేశానికి గుర్తింపు తీసుకువచ్చారన్నారు ఈనెల 12వ తేదీన హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో సోషల్ మీడియా ఇన్చార్జిల జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా వస్తున్నారని,ఆ సమావేశాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, బిజెపి మాజీ మండల అధ్యక్షులు వెంకట గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు స్వామి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు నర్సింలు, సీనియర్ నాయకులు నీల స్వామి, నీల చంద్రం, స్వామి, తిరుపతి రెడ్డి, నరేష్ గౌడ్, డాక్టర్ స్వామి, వెంకట్ గౌడ్, సంతోష్ రెడ్డి, సుఖేందర్, మధు, గోపాల్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణ గౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

రిమ్మనగూడ గ్రామంలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతుందని గజ్వేల్ సీఐ బి.సైదా అన్నారు. ఆదివారం రిమ్మనగూడ గ్రామానికి చెందిన వెంకట నరసింహారావు, రిటైర్డ్ ఆర్మీ గ్రామ సర్పంచ్ వెంకట్ గౌడ్, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గ్రామ పెద్దలు ప్రజలతో కలసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువ ఉన్నందున ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువ తాగాలన్నారు. ప్రజల దహతి తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన వెంకటనరసింహారావును అభినందించారు. అంతేకాకుండా సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.రిమ్మనగూడ గ్రామంలో ఉన్న అన్ని గల్లీలను గ్రామ పెద్దలతో కలిసి తిరిగి ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలో పరిశీలించారు. ఎగ్జిట్ ఎంట్రీ పాయింట్లు మెయిన్ చౌరస్తాలు పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు ముందుకు రావాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా నేను సైతం ప్రోగ్రాం ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సెన్సాఫ్ సెక్యూరిటీ, ప్రజల రక్షణకు సీసీ కెమెరాలు బాగా ఉపయోగపడతాయని గ్రామంలో నిఘా ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న గ్రామాలలో నేరాలు చేయడానికి దొంగలు భయపడతారన్నారు. ఎవరు తప్పు చేసినా వెంటనే పట్టుకోవచ్చని సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులందరూ సమైక్యంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, రాంప్రసాద్, నాగరాజు ఎస్ఐ శంకర్, కానిస్టేబుళ్ల రవి, రవీందర్, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మహాదేవుని రథోత్సవం

నవ తెలంగాణ-రాయపోల్



మహాదేవుని కళ్యాణ మహెూత్సవం ముగిసిన తర్వాత రామారం గ్రామంలో అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు.మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాయపోల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో దేవాలయాలలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి సంవత్సరం లాగే నిర్వహించే శివపార్వతుల కళ్యాణ మహెూత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవాలయాలను విద్యుత్కాంతి దీపాలతో రంగురంగులతో సుందరంగా వైభవంగా తీర్చిదిద్దారు. రామారం గ్రామంలో మహాదేవుని కల్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం మొదలుకొని ఆదివారం వరకు కల్యాణ మహెూత్సవాలు భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలలో భాగంగా శివ పార్వతుల కళ్యాణ మహెూత్సవం వేదపండితులు మంత్రోచ్ఛారణలతో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద జాతర జరిగింది. ఆదివారం భక్తిశ్రద్ధలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శివపార్వతులను రథంపై ఊరేగించారు. గ్రామ ప్రజలు ఊరేగింపులో పాల్గొని హారతులు ఇస్తూ, మహిళల కోలాటాలతో చిన్నారులు పెద్దలు నృత్యాలతో ఉల్లాసంగా పాల్గొంటే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలలో రాయపోల్, రామారం, గొల్లపల్లి, ఉదయపూర్ చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండవసారి మండల అధ్యక్షుడిగా తమల శ్రీనివాస్

నవతెలంగాణ-ములుగు



కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రెండవసారి మామిడాల గ్రామానికి చెందిన తమ్మల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మండల పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ బైలంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశానికి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి హాజరై కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడిగా మామిడాల గ్రామానికి చెందిన తమల శ్రీనివాసులు నియమించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఆరుగారంటీలను అమలు చేసే క్రమంలో కొన్ని మార్పులు చేర్పులు చేయడం సహజమని ఆయన అన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు అని అన్నారు. ములుగు మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తాను తొలగించి నూతన అధ్యక్షుడిగా తమల శ్రీనివాస్ కొనసాగుతారని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకై ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బైలంపూర్ గ్రామ అధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి కొత్తూరు గణేష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

దేవాలయ అభివృద్ధికి కృషి

అనంతరావుపల్లి మాజీ సర్పంచ్ మహేందర్

నవతెలంగాణ -గజ్వేల్



గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు గజ్వేల్ మండలం అనంతరావుపల్లి మాజీ సర్పంచ్ మహేందర్ అన్నారు. ఆదివారం గ్రామంలో నిర్మించే పోచమ్మ గుడి నిర్మాణం కోసం మాజీ ఎంపీటీసీ గాలంక నరసింహులు 25వేల రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరు సహకారంతో గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో సైతం గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అందించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బైరం స్వామి, బైరమ్ శివకుమార్, గద్ద నరేష్, మంకిడి ప్రభాకర్, అశోక్, రవి, గద్ద అశోక్, బాలస్వామి, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని వరదరాజపూర్ గ్రామంలో బిజెపి కార్యకర్త సాధమైన శివప్రసాద్ తండ్రి మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ మండల బిజెపి అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో టి.రమేష్ గుప్తా తాడూరు మహేష్ గౌడ్, సంజీవ్ రెడ్డి ,రాజు, మహేందర్, నర్సింలు, సురేష్ ,నగేష్, రాకేష్, నరేష్ ,తదితరులున్నారు.

దివ్యాంగుల నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని శనిగరం గ్రామంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల సంపత్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా దొమ్మాట కృష్ణారెడ్డి, ఉపాధ్యాక్షుడిగా తూళ్ళ ఎల్లయ్య ప్రధాన కార్యదర్శిగా మహంకాళి లింగయ్య, సహాయ కార్యదర్శిగా భౌరోజు చంద్రశేఖర్, కోశాధికారిగా ఆకుబత్తిని ఆనంద్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా దారణ మోహన్‌కుమార్, ఠాకూర్ అజయ్‌సింగ్, భైరోజు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దుంబాల వేణుగోపాల్, గ్రామ దివ్యాంగులు పాల్గొన్నారు.

అనారోగ్యం భరించలేక వృద్ధురాలు ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, అనారోగ్యం భరించలేక పురుగుల మందు సేవించి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం కృష్ణసాగర్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లి మధిర గ్రామం క్రిష్ణ సాగర్ లో కొప్పుల ఆంజనేయులు తాపీ మేస్త్రిగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషి కుంటున్నాడు. వారి తల్లి కొప్పుల సుశీల (64) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతుంది. అలాగే సంవత్సరం క్రితం ఇంటిదగ్గర కింద పడడంతో కాలు విరిగింది. రెండు రకాల అనారోగ్య సమస్యలతో కొద్ది రోజులుగా బాధపడుతూ చికిత్స తీసుకుంటుంది. గురువారం కొడుకు ఆంజనేయులు, కోడలు భార్గవి మేస్త్రి కూలి పలికి గజ్వేల్ కి వెళ్లారు. అనారోగ్యం భరించలేక ఇంటిదగ్గర ఎవరు లేని సమయంలో సుశీల పురుగుల మందు సేవించింది. అనంతరం వాంతులు చేసుకుంటూ పడిపోవడంతో గమనించిన స్థానికులు కుమారుడికి సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి సుశీల మృతి చెందారు. అనారోగ్యాన్ని భరించలేక మా తల్లి సుశీల పురుగుల మందు సేవించి మృతి చెందిందని మృతురాలి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

నేడు కాంగ్రెస్ లో చేరనున్న సల్కం మల్లేష్

నవ తెలంగాణ- దుబ్బాక



మండల పరిధిలోని పోతారం గ్రామానికి చెందిన బీఎస్ పీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి సల్కం మల్లేశం యాదవ్ బీఎస్పీని వీడి కాంగ్రెస్ లోకి చేరనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సోమవారం పురపాలిక కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి,దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిల సమక్షంలో ఆయన సుమారు 1000 మంది అనుచరులతో కాంగ్రెస్ లో చేరుతున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమా నికి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతి నిధులు, నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కాంగ్రెస్ దుబ్బాక మండల అధ్యక్షుడు కొంగర రవి కోరారు.

ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి

తొగుట సీఐ లతీఫ్



నవ తెలంగాణ- రాయపోల్

రానున్న ఎన్నికలలో ప్రజలందరూ సోదర భావంతో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాజిత వాతావరణంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు జరుపుకోవాలని తొగుట సిఐ లతీఫ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి రాయపోల్ మండలం వెంకంపేట గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మరియు ట్రాఫిక్ నియమాల గురించి ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి అడిగితే చెప్పకూడదని,సోషల్ మీడియా దానివల్ల జరిగే పరిణామాల గురించి వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను వదంతులను గుడ్డిగా నమ్మరాదని నమ్మి వాటి వల్ల భయభ్రాంతులకు గురి కావద్దని సూచించారు.విద్యార్థులు సెల్ ఫోన్‌లకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్సై రఘుపతి, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.